క్లుప్తంగా

అధికారులంతా హాజరుకావాలి

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో మహేశ్వరరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లంతా వస్తున్నారని, మండల స్థాయి అధికారులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

రాజాం మున్సిపాలిటీకి సర్వేయర్ నియామకం

రాజాం: రాజాం మున్సిపాల్టీ సర్వేయర్‌గా మరిపి ఈశ్వరసత్యన్నారాయణ నియమితులయ్యారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆయన ఇక్కడకు వచ్చారు. ఇంతకుముందు ఆయన సంతకవిటి మండల సర్వేయర్‌గా విధులు నిర్వహించారు. రాజాం మున్సిపాల్టీగా ఏర్పడిన తరువాత తొలిసర్వేయర్ ఈయనే కావడం విశేషం. రాజాం మున్సిపాల్టీగా ఏర్పడిన 19 ఏళ్ల అనంతరం సర్వేయర్‌ను నియమించారు. 2005లో రాజాం నగర పంచాయతీగా ఏర్పడింది. 2021లో గ్రేడ్–3 మున్సిపాల్టీగా మారింది. ఇంతవరకూ ఇక్కడ ఎన్నికల జరుగలేదు. మరో వైపు సర్వేయర్ నియామకం కూడా జరుగలేదు. పట్టణంలో సర్వేలు నిమిత్తం రాజాం మండల సర్వేయర్‌ను వినియోగించేవారు. తొలిసారి ఇక్కడ ఈశ్వర సత్యన్నారాయణ సర్వేయర్‌గా నియమితులుకావడంతో పట్టణవాసులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఆయన మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడును గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

సంతకవిటి: మండలంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతోంది. ప్రతిరోజూ ట్రాక్టర్లు, లారీలు, నాటుబళ్లల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. అధికారులకు పట్టుబడకుండా ఉండేందుకు రోడ్లపై అతివేగంగా వాహనాలను నడుపుతున్నారు. ఇదంతా చూస్తున్న ప్రజలు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు హెచ్చరిస్తున్నా ఇసుక అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదంటున్నారు.

ఖైదీల్లో పరివర్తన తేవాలి

బొబ్బిలి: ఖైదీల్లో పరివర్తన తీసుకురావాలని, వారు మంచి మనుషులుగా జైలు నుంచి బయటకు వెళ్లాలని జిల్లా న్యాయమూర్తి బి.కల్యాణ్ చక్రవర్తి అన్నారు. స్థానిక సబ్‌జైలును గురువారం సందర్శించిన ఆయన.. జైలు జీవితం గడుపుతున్న ఖైదీల్లో మంచి ప్రవర్తన అలవడేలా చేయాలన్నారు. ఏ కారణం చేత ఇలా జైలులో మగ్గిపోవాల్సి వస్తోంది.. కుటుంబ సభ్యులకు ఎందుకు దూరంగా ఉంటున్నామన్న విషయాలను వారంతట వారే తెలుసుకుని, ఇకమీదట తప్పు చేయకూడదన్న భావన వారిలో కలగాలన్నారు. అలాగే ఖైదీల సమస్యలు, వారికి అందిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి కె. విజయకల్యాణి, బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీరావు, సబ్ జైలర్ పాత్రో, జైల్ విజిటింగ్ అడ్వకేట్ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

సంతకవిటి: మండలంలోని మందరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు భగవంతుడే నా నిజమైన స్నేహితుడు అనే అంశంపై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా శ్రీసత్యసాయి సేవా సమితిల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతోందని సంతకవిటి శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆంజనేయ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని సాయంత్రం తిరువీధి నిర్వహించారు. అనంతరం నిమజ్జనం చేశారు. ఊరేగింపు సమయంలో మహిళలు చేసిన కోలాటం, యువత నృత్యాలు, వేషధారణలు ఆకట్టుకున్నాయి.

రికార్డుల పరిశీలన

రేగిడి: మండలంలోని దేవుదళ కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)ని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించి, అక్కడి విద్యార్థుల చదువు, వారికి అందిస్తున్న వసతులపై ఆరాతీశారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నాణ్యమైన విద్యనందిస్తూనే మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. రానున్న పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు.

నూతన సాగు పద్ధతులు అవలంబించాలి

రేగిడి: పంటల సాగులో నూతన పద్ధతులు అవలంబించాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని నాయిరాలవలస, తునివాడ గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ కొత్త సాగు పద్ధతుల ద్వారా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. మోతాదుకు మించి పంటల్లో ఎరువులు వినియోగించవద్దన్నారు. ఎప్పటికప్పుడు పంటను పంటకు తెగుళ్లు, చీడపీడలు సోకకుండా తగిన జాగ్రత్త వహించాలన్నారు.

మత్తుతో జీవితం చిత్తు

● అవగాహన సదస్సులో సీఐ కె.అశోక్‌కుమార్

రాజాం సిటీ: గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు కళాశాలలో విద్యార్థులకు చెడు అలవాట్లు–వాటి దుష్ప్రభావాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత రోజుల్లో చాలామంది విద్యార్థులు ఫ్యాషన్ మాయలో పడి మత్తుపదార్థాలకు బానిసలై, జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థి చెడు అలవాట్లకు దూరంగా సమాజంలో మంచి పౌరులుగా జీవించాలని కోరారు. అలాఏ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించి, వాటి బారినపడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అనంతరం ఆటోడ్రైవర్లతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. పరిమితికి మించి వాహనాల్లోకి ప్రయాణీకులను ఎక్కించవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



రాజాం సిటీ: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

సంతకవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు–వాటి చెడు ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్‌ఐ ఆర్.గోపాలరావు మాట్లాడుతూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి చెడు అలవాట్ల బారినపడి ఎంతోమంది యువత చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తుకు అలవాటు పడితే బానిసలై జీవితాలు నాశనమైపోతాయని హెచ్చరించారు. ప్రతిఒక్కరిలో ఉన్నతంగా జీవించాలన్న ఆలోచన రావాలని, ఆ దిశగా జీవనం కొనసాగించాలన్నారు.


సంతకవిటి: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గోపాలరావు

చంద్రబాబు పాపాల ప్రక్షాళనకు తరలిరండి

బొబ్బిలి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాపాల ప్రక్షాళన చేసేందుకు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం పిలుపునిచ్చారు. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ అని దుష్ప్రచారం చేసి, చంద్రబాబు ఘోర పాపం చేశారని, ఈ మేరకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నెల 28వ తేదీన స్థానిక పట్టణంలోని స్వామి వారి వీధి లోని వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ పూజలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు. నియోజకవర్గంలోని బాడంగి, రామభద్రపురం, తెర్లాం, బొబ్బిలి మండలాల నాయకు లు కూడా సమీప ఆలయాలకు వెళ్లి, చంద్రబాబు దుష్టపన్నాగం అంతం చేయాలని భగవంతుడిని వేడుకోవాలన్నారు.


మాజీ ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 28వ తేదీన స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపట్టనున్న ప్రత్యేక పూజలకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు కోరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని, తిరుమల పవిత్రతను, స్వామి వారి లడ్డూ ప్రసాదం విశిష్టతను, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, లడ్డూ పవిత్రతను రాజకీయ దుర్బుద్ధితో కావాలని అసత్యాలతో సీఎం చంద్రబాబు అపవిత్రం చేశారన్నారు. ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయడం జరుగుతోందన్నారు.


తెర్లాం: మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు సత్యంనాయుడు, ఎంపీపీ ప్రతినిధి బాబ్జీరావు

ప్రశ్నిస్తే కేసు పెడతారా?

మెంటాడ: ప్రశ్నించినందుకు తనపై కేసు పెడతారా అని వైఎస్సార్ సీపీ నేత గేదెల రామకృష్ణ మండిపడ్డారు. ఇదే విషయమై ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఇప్పలవలస గ్రామ పంచాయతీలో టీడీపీ మద్దతుదారులు నిర్వహిస్తున్న బెల్టుషాపును వ్యతిరేకించినందుకు పోలీసులపై ఒత్తిడి తెచ్చి, తనపై కావాలని తప్పుడు కేసు బనాయించారన్నారు. ఇటీవల శ్రీరామాలయం నిర్మాణం కోసం ప్రజల నుంచి వసూలు చేసిన చందాలు, ప్రభుత్వం కేటాయించిన నిధుల లెక్క చెప్పాలని డిమాండ్ చేస్తే తనపై టీడీపీకి చెందిన పలువురు దాడికి పాల్పడ్డారన్నారు. దీనిపై పోలీసులను ఆశ్రయించి, ఫిర్యాదు చేసినా మంత్రి సంధ్యారాణి ఒత్తిడితో పోలీసులు కేసు నమోదు చేయలేదన్నారు. అధికార పార్టీకో న్యాయం ప్రజలకో న్యాయమా అని ప్రశ్నించారు. అధికార మదంతో టీడీపీ శ్రేణులు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలు ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు వారే తగిన బుద్ధి చెబుతారన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బొబ్బిలి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్థానిక పట్టణంలోని యుద్ధ స్తంభం వద్ద పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొని, చీపురు పట్టి పరిసరాలను ఊడ్చారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో సేవలందించిన పట్టణ పారిశుద్ధ్య కార్మికులకు పారిశుద్ధ్య కిట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్, కౌన్సిలర్ వెలగాడ హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వన్నలి, ఉప్పర్నాయుడువలస, చాటాయివలస తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు గురువారం చేపట్టారు. వీధులు, కాలువల్లోని చెత్తాచెదారం తీసి, డంపింగ్‌యార్డుకు తరలించారు. అనంతరం తాగునీటి వనరుల ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లారు. ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు ముమ్మరం చేసి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఈవోపీఆర్‌డీ సత్యనారాయణ సూచించారు. ఇచ్చిన బ్లీచింగ్ పౌడర్‌ను తాగునీటి వనరులు, కాలువల వద్ద జల్లాలని తెలిపారు.


రేగిడి: వన్నలి గ్రామంలో తాగునీటి కుళాయి వద్ద బ్లీచింగ్ చల్లిస్తున్న అధికారులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వంగర: మండలంలోని ఎం.సీతారాంపురం ఫీడర్ పరిధిలోని చినరాజులగుమ్మడ, పెదరాజులగుమ్మడ, వీవీఆర్ పేట, జేకే గుమ్మడ గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ వి.సాంబశివరావు ఓ ప్రకటనలో గురువా రం వెల్లడించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. విద్యుత్ తీగలపై ప్రమాదకరంగా వేలాడుతున్న చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న 11 కేవీ బూరాడ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో కాగితాపల్లి, పనసలవలస, పారంపేట, ఉనుకూరు, పోరాం, అంబాడ, వెంకటాపురం తదితర గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని ఇన్‌చార్జ్ ఏఈ లావేటి హరిబాబు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బొబ్బిలిరూరల్: బలిజిపేట ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో బొబ్బిలి, గొల్లపల్లి, బలిజిపేట, పినపెంకి, వంతరాం, నెమలాం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ట్రాన్స్ కో బొబ్బిలి ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ అసౌకర్యం ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వినూత్న నిరసన

బొబ్బిలి: పట్టణంలోని సివిల్ సప్లయి గొడౌన్ వద్ద పౌర సరఫరాల సంస్థ హమాలీలు కళ్లకు గంతలు కట్టుకుని, వినూత్నంగా గురువారం నిరసన చేపట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హమాలీలు మాట్లాడుతూ వేతనాలు, వేతన బకాయిలకు సంబంధించి, ప్రత్యేక జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జనవరి నుంచి కొత్త రేట్ల ప్రకారం బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. అటు ప్రభుత్వం, ఇటు సివిల్ సప్లయి అధికారులు హమాలీల సంఘ నాయకులతో చర్చలు జరిపి, సమస్యను పరిష్కరించాలన్నారు. తొమ్మిది నెలలుగా వేతన బకాయిలు ఉండిపోయాయని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హమాలీల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీల సంఘ నాయకులు పొందూరు గోపి, మెండి నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

రాష్ట్ర స్థాయి పోటీలకు బాడంగి విద్యార్థులు

బాడంగి: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ బంగారునాయుడు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. మండలంలోని పారాది గ్రామంలో ఈ నెల 24వ తేదీన జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అండర్–14 విభాగంలో కె.రమ్య,ఎ.ప్రియాంక, సీహెచ్ నీలిమ, పి.రేవతి, ఎం.ప్రసన్న, ఎస్.యశ్వంత్‌లు, అండర్–17 విభాగంలో కె.జ్యోతి, ఎం.శ్రీనులు విశేష ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరంతా అనంతపురం, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా సదరు విద్యార్థులకు సిబ్బంది అభినందనలు తెలిపారు.


ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

105 యూనిట్ల రక్తం సేకరణ

బొబ్బిలి: పట్టణంలోని గొడ వీధిలో అభ్యుదయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో దాతల నుంచి 105 యూనిట్ల రక్తం సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం 105 మంది రక్తం దానం చేశారని, ఆ రక్తాన్ని ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్, బొబ్బిలి బ్లడ్ సెంటర్‌లకు అందజేశామన్నారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రక్తదానంపై అపోహలు వీడి, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో అభ్యుదయ సేవా సంస్థల వ్యవస్థాపకుడు మర్రాపు కూర్మినాయుడు (నాని మాస్టారు), అధ్యక్షుడు డాక్టర్ చింత శారద, సహాయ, అమ్మ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సాయికుమార్, సురేష్, సాయి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఆలోచన వద్దు

బొబ్బిలి: విద్యుత్ చార్జీలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, ఆ ఆలోచన విరమించుకోవాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పొట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక పట్టణంలోని చీపురుపల్లి వీధిలో ఉన్న ఆ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నేతల సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. స్మార్ట్‌మీటర్లు ప్రవేశపెట్టి తద్వారా విద్యుత్ చార్జీలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ చార్జీలు, నిత్యవసర సరుకుల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని, నిత్యావసరాల ధరలతో పాటు విద్యుత్ చార్జీల ధరలు తగ్గించాలని కోరారు. సమావేశంలో ఆ పార్టీ కార్యదర్శి డి.ఆదిలక్ష్మి, ఎల్.లక్ష్మి, డి.రామలక్ష్మి, వై.లలిత పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఘనంగా సామూహిక సీమంతం

తెర్లాం: పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని జన్నివలస గ్రామంలో సామూహిక సీమంతం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. హిందూ సంప్రదాయ పద్ధతి ప్రకారం జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొని, మెరుగైన ఆరోగ్యం, సుఖ ప్రసవానికి గర్భిణులకు పలు సూచనలు చేశారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా మందులు వేసుకోవాలని, రోజువారీ ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు, ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ హేమంత్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి సునీల్‌కుమార్, సీఎస్‌టీడీ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి ఎం.ఎ.స్వామి, సర్పంచ్ బోడెల విజయబాబు తదితరులు పాల్గొన్నారు.


తెర్లాం: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు

రామభద్రపురం: పౌష్టికాహారంతో బాలింతలు, గర్భిణులు, కిశోరి బాలికలు, మహిళల్లో రక్తహీనత సమస్యకు చెక్ పెట్టవచ్చని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. మండలంలోని నాయుడువలస అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార మాసోత్సవాలకు గురువారం హాజరైన ఆయన.. తహసీల్దారు సులోచనరాణి.. అక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య తనిఖీలు చేయించుకుని, మందులు వేసుకోవాలని సూచించారు. అలాగే ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయుడువలస, రామభద్రపురం సర్పంచ్‌లు ఎస్.లక్ష్మి, ఆర్.ఈశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, సూర్యకుమారి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.


రామభద్రపురం: గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన తదితరులు

ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తాం

బొబ్బిలిరూరల్: ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బేబీనాయన హామీ ఇచ్చారు. మండలంలోని కొండదేవుపల్లి గ్రామంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రైతులకు సాగునీరు అందించేందుకు గతంలో మంజూరైన ఎత్తిపోతల పథకాన్ని రూ.20 కోట్ల వ్యయంతో త్వరితగతిన పనులు ప్రారంభించి, వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. శివడవలస, కమ్మవలస, కొండదేవుపల్లి గ్రామాల రైతులు సాగునీటి కోసం పడుతున్న కష్టాలను సర్పంచ్ రమణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, ప్రజలకు అవసరమైన తాగునీరు, సాగునీరు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

అనవసర యాప్‌లు డౌన్‌లోడ్ చేయొద్దు

రేగిడి: అనవసరమైన యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని స్వచ్ఛభారత్ మండల కో–ఆర్డినేటర్ పద్మ సూచించారు. మండలంలోని బూరాడ గ్రామంలో అనవసర యాప్‌ల వల్ల కలిగే నష్టాలపై గురువారం అవగాహన కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లో అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటే ఫోన్ చెడిపోతుందన్నారు. అలాగే అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్, అనవసర మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీని ఎవరికీ చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి సమస్యలు తీసుకురండి

రాజాం/రేగిడి/వంగర/సంతకవిటి/బొబ్బిలి రూరల్/బాడంగి/రామభద్రపురం/తెర్లాం: మండలాల్లోని పలు గ్రామాల్లో గ్రామ సందర్శన కార్యక్రమం గురువారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు, ఐసీడీఎస్ పీవోలంతా కలిసి గ్రామాల్లో పర్యటించి, అక్కడి ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పశు వైద్యశాలలు, సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లను సందర్శించి, సిబ్బంది పనితీరు, సదుపాయాలను పరిశీలించారు. అనంతరం గ్రామసభలు నిర్వహించి, గ్రామస్తుల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. సమస్యల పరిష్కారానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రతిఒక్కరూ అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువచ్చి, పరిష్కరించుకోవాలని తెలిపారు.


తెర్లాం: కూనాయవలస మినీ అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు


బాడంగి: వీరసాగరం రేషన్ డిపోలో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దారు సుధాకర్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుధాకరరావు


రామభద్రపురం: గొల్లలపేట పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేస్తున్న ఎంపీడీవో రమామణి


వంగర: అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శనలో మండల ప్రత్యేకాధికారి సందీప్ తదితరులు


బొబ్బిలిరూరల్: కొండదేవుపల్లి అంగన్‌వాడీ కేంద్రం సందర్శనలో తహసీల్దారు శ్రీను, ఎంపీడీవో రవికుమార్


రాజాం: నందబలగలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్న నోడల్ ఆఫీసర్ నిర్మలకుమారి


సంతకవిటి: మందరాడ పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న అధికారులు


రేగిడి: పెద్దశిర్లాం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని, లేకపోతే స్కావెంజర్స్‌పై చర్యలు తప్పవని ఎంఈవో జె.త్రినాథరావు హెచ్చరించారు. మండలంలోని కాగాం ప్రాథమిక పాఠశాలను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత ఆయన పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, చేతిరాత, హోమ్‌వర్క్ పుస్తకాలు, మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ విద్యార్థులు వినియోగించేందుకు వీలుగా స్కావెంజర్స్ మరుగుదొడ్లను శుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మరింత మెరుగుపరచాలని సిబ్బందికి తెలిపారు. మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి, శుచి కలిగి ఉండాలన్నారు. ఆయన వెంట ఎంఈవో–4 ఆర్.పాపారావు తదితరులు ఉన్నారు.

ఎలక్ట్రిక్ బైక్ నుంచి మంటలు

రేగిడి: మండలంలోని కొండవలస గ్రామానికి చెందిన బెవర తులసి ఎలక్ట్రిక్ బైక్‌లో నుంచి గురువారం మంటలు చెలరేగాయి. బైక్‌పై ఆమె వెళ్తున్న సమయంలో మంటలు రాగా, ఆమె భర్త బెవర ఆనందరావు గమనించి, కేకలు వేశాడు. ఆమె అప్రమత్తమై, వాహనాన్ని నిలిపివేసి, పాలకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బందితో అక్కడికి చేరుకున్న అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు కాలిపోయిన బైక్‌ను పరిశీలించారు.